# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 సంచిక : 100 శుక్రవారం 20 జూన్ 2025 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కలహాల కమలం?



- ముందుకు సాగని కార్యాచరణ
- అధికార పీఠాన్ని దక్కించుకోవడమే టార్గెట్‌గా అడుగులు వేస్తున్న కమలదళం వ్యూహాలు అంతగా వర్కౌట్ అవ్వడం లేదా?
- కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచనలు..
- కార్యరూపం దాల్చడంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయా?
- అందుకే ఇప్పుడు కాషాయ నేతలు సరికొత్త స్ట్రాటజీతో ప్రజల ముందుకు వస్తున్నారా?

హైదరాబాద్

తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవడమే టార్గెట్‌గా అడుగులు వేస్తున్న కమలదళం వ్యూహాలు అంతగా వర్కౌట్ అవ్వడం లేదా? కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచనలు.. కార్యరూపం దాల్చడంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయా? అందుకే ఇప్పుడు కాషాయ నేతలు సరికొత్త స్ట్రాటజీతో ప్రజల ముందుకు వస్తున్నారా? అసలు తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో చూద్దాం. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఒక ప్రజా ప్రతినిధి. పులిని చూసి ఇంకేదో వాత పెట్టుకున్నట్టు ఉంది ప్రస్తుత బీజేపీ వ్యవహారం.. బీజేపీ భరోసా పేరుతో ప్రజలకు అండగా నిలవాలని.. ప్రజల నుంచి వారి సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవడం మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రతి రోజు ఒక ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించడం ప్రారంభించారు. దీనికి తగ్గట్టుగానే ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఉదయనీ 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పార్టీ కార్యాలయంలో - మిగతా3లో



## 15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ

- కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం
- నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది.

# బనకచర్లను అడ్డుకోండి

- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రాజెక్టు ప్రతిపాదన
- జీడబ్ల్యూడీటీ, రాష్ట్ర పునర్విభజన చట్టం ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్
- గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీల జలాల వినియోగానికి బ్లాంకెట్ ఎన్వోసీ ఇవ్వండి
- తొలి నుంచి కూడా గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తూ వస్తోంది
- బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంది
- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సీఎం రేవంత్



న్యూఢిల్లీ

ఢిల్లీ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై ఫిర్యాదు చేయనున్నారు. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా కట్టడి చేయాలని అని కోరనున్నారు. గోదావరి - బనకచర్ల లింకు ప్రాజెక్టుకు సంబంధించిన ఫీజుబులిటీ రిపోర్టును తక్షణమే తిరస్కరించాల్సిందిగా కేంద్ర మంత్రికి మంత్రి ఉత్తమ్ లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ అడ్డుకోవడంతో పాటు ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు నిలువరించాలని కేంద్రానికి తెలంగాణ సీఎం, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేయనున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ అధికారులు, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా - మిగతా3లో



## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు

- తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదు
- తెలంగాణకు నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమే
- రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదని అన్నారు. తెలంగాణకు నీళ్ల - మిగతా3లో



## ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

- కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు
- మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు
- మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం.

## రాహుల్ ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకరించింది



- రాబోయే తరానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిక్సూచి
- రాహుల్‌గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన చేసింది
- మంత్రి పొన్నం ప్రభాకర్



## ఐటీ ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!

- త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది
- ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు
- ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం?

## సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా

- ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మందికి రైతుభరోసా నిధులు జమ
- రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు జమ
- ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్

అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మందికి రైతుభరోసా నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు ఇవాళ జమ చేసినట్లు చెప్పారు. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వేసే లక్ష్యంతో నిధులు విడుదల చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు 62 లక్షల 47వేల మంది రైతులకు ఒక కోటి 6 లక్షల ఎకరాలకు - మిగతా3లో



## అమెరికా వీసా ఓ 'ప్రివిలేజ్' మాత్రమే.. 'హక్కు' కాదు

- ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఆ వీసాను రద్దు చేసే అవకాశం
- భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.
- స్టూడెంట్ లేదా పర్యటక వీసాపై వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారు

# ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వన్ ఇయర్

**ముంబై :** భారత ప్రభుత్వం ఫాస్టాగ్ ఇయర్ పాస్ అనే కొత్త విధానం తీసుకొచ్చింది. రూ. 3,000పెట్టి ఈ పాస్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. నేషనల్ హైవేలపై ఉన్న రద్దీని తగ్గించేందుకు ఈ విధానం తీసుకొచ్చినట్టు కేంద్రం చెబుతోంది. అంతే కాకుండా ఒకేసారి ఏడాదికి పాస్ తీసుకుంటే వాహనదారుడికి కూడా లాభం ఉంటుందని పేర్కొంటోంది. ఈ కొత్త విధానం 15 ఆగస్టు 2025 నుంచి అమల్లోకి రానుంది. ఫాస్టాగ్ ఇయర్ పాస్ అనేది ప్రైవేట్ వాహనాల కోసం రూపొందించిన విధానం. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్‌ల వద్ద ఉన్న రద్దీ, ఇతర సమస్యలు తగ్గించేందుకు రూపొందించిన ప్రక్రియ. ఒకసారి రూ. 3,000తో రీఛార్జ్ చేస్తే ఒక సంవత్సరం పాటు వాడుకోవచ్చు. లేదా 200 సార్లు ప్రయాణాల చేసేందుకు కూడా వాడుకోవచ్చు. ఏది ముందు అవుతుందో దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఈ ఇయర్ పాస్ తీసుకోవడంతో రోజు వారి పాస్ చెల్లింపులు పూర్తిగా తగ్గిపోతాయి. అలాంటి వాహనాల కోసం ప్రత్యేకంగా రూట్ క్లియరెన్స్ ఉంటుంది. ఎలాంటి రద్దీ లేకుండా టోల్ స్టేషన్‌ల వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కోకుండా వెళ్లిపోవచ్చు. రహదారిపై రాకపోకలు సులభతరం అవుతుందనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని తీసుకొచ్చినట్టు రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ ప్రక్రియతో జాతీయ రహదారులపై ప్రయాణం మరింత వేగవంతా సులభతరం అవుతుదని అభిప్రాయపడ్డారు. ఫాస్టాగ్ ఇయర్ పాస్ 15 ఆగస్టు 2025 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వస్తుంది. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా , రోడ్డు రవాణా అండ్ రహదారుల శాఖ అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా ఈ వార్షిక పాస్ కొనుగోలు చేయవచ్చు. ఈ పాస్‌ను కొనేందుకు మీకు ఫాస్టాగ్ ఖాతా, వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబర్, ఆన్‌లైన్ వెరిఫికేషన్ అవసరం అవుతాయి. కొనుగోలు ప్రక్రియ చాలా సులభంగా ఉంటుంది. యాప్‌లో లేదా వెబ్‌సైట్‌లో ఒకసారి




లాగిన్ అయిన తర్వాత వాహనానికి సంబంధించిన వివరాలు ఎంటర్ చేయాల్సి ఉంటుంది. తర్వాత రూ. 3,000 చెల్లించాలి. ఆ తర్వాత మీ ఫాస్టాగ్‌కు ఈ పాస్ అటాచ్ అవుతుంది. ఈ పాస్ ఒక సంవత్సరం మాత్రమే పని చేస్తుంది. లేదా 200 ట్రిప్‌లు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఈ రెండింటిలో ఏది ముందు అయితే దాన్నే పరిగణలోకి తీసుకుంటారు. ఒక ట్రిప్ అంటే ఒక టోల్ గేట్‌ను దాటడాన్ని ట్రిప్ అంటారు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లే మార్గంలో చాలా టోల్ గేట్‌లు ఉంటాయి. అందులో ఒక్కో టోల్‌గేట్ ప్రవేశం నుంచి ఎగ్జిట్ వరకు ఒకే ప్రయాణంగా లెక్కిస్తారు. అంటే ఎన్ని టోల్‌గేట్‌లు దాటితే అన్ని ట్రిప్‌లగా గుర్తిస్తారు. ఇలా 200 ప్రయాణాలు పూర్తైన తర్వాత మళ్లీ రూ. 3,000 చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్ జాతీయ రహదారుల మీద మాత్రమే పనిచేస్తుంది. రాష్ట్ర రహదారులు లేదా స్థానిక టోల్ గేట్‌ల వద్ద పని చేయదు. అక్కడ కచ్చితం గా టోల్ రుసుములు చెల్లించాలి. ఇది కార్లు, జీపులు, వ్యాన్ లు వంటి వ్యక్తిగత అవసరాల కోసం నిర్దేశించిన వాహనాలకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. ఈ పాస్ మాల్స్, విమానాశ్ర యాలు, లేదా పార్కింగ్ స్థలాల్లో పనిచేయదు. హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డుపై కూడా టోల్ స్టేషన్‌లు ఉన్నాయి. అక్కడ మాత్రం ఈ ఇయర్ టోల్ పాస్ పని చేయదు. అక్కడ మీరు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసుకోవాల్సి ఉంటుంది. రోజూ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి ఎక్కువ ఉపయోగపడుతుంది. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, వైజాగ్, విజయవాడ వంటి పెద్ద నగరాల మధ్య ఎక్కువ సార్లు తిరిగే వాళ్లకు యూజ్ అవుతుంది.

# ఐటీ ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!

మీరు ఐటీ ఉద్యోగులా?. అయితే మీ నెత్తిన మరో గుదిబండ పడబోతోంది!. త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు పడబోతోంది. ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందంటూ దక్కన్ హెరాల్డ్ ఓ కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ప్రస్తుతం కర్నాటకలో సెక్షన్7,కర్ణాటక షాప్స్, కమిర్షియల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 1961 ప్రకారం.. 9 పని గంటలు కొనసాగుతున్నాయి. పండగలు, పబ్బాలు వంటి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కనీసం సంవత్సరంలో ఏదైనా మూడు నెలల్లో ఉద్యోగులతో అదనంగా 10 గంటలు పనిచేయించుకోవచ్చు. ఈ పనిగంటలు 50 గంటలు మించకూడదు. కానీ కర్ణాటక ప్రభుత్వం తాజాగా కొత్త పనిగంటల ప్రతిపాదనలు తెరపైకి తెరపైకి తెచ్చినట్లు దక్కన్ హెరాల్డ్ హైలెట్ చేసింది. ఉద్యోగులు ఇకపై 10 పని గంటలు, అదనంగా 12 గంటలు పనిచేయించుకుంటే ఎలా ఉంటుందా? అనే దిశగా ప్రభుత్వం కార్మికశాఖ, ఐటీ రంగ నిపుణులతో చర్చలు జరుపుతోంది. ఫలితంగా ప్రత్యేక సందర్భాలలో అదనంగా చేసే పనిగంటలు 50 నుంచి ఏకంగా 140 గంటలు చేరుకోనున్నాయి.

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పనిగంటల్ని పెంచి ఉద్యోగుల హక్కుల కాలరాజేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నాయి. పనిగంటలు పెంచడం వల్ల ఉద్యోగులు



తమ హక్కులపై ప్రతికూల ప్రభావంతో పాటు పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్‌కు విఘాతం కలుగుతోందని అంటున్నారు. కర్ణాటకతో పాటు ఏపీలో కూటమి ప్రభుత్వంపై సైతం పనిగంటల్ని పెంచే ప్రతిపాదనలు తెరపైకి తెచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో వ్యాపారాన్ని సులభతరం చేయడంతో పాటు ఇన్వెస్టర్లను ఆకట్టుకునేలా తొమ్మిది పనిగంటల్ని పది పనిగంటలు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఉద్యోగులకు, సంస్థలకు లబ్ధి చేకూరేలా కార్మిక చట్టాల్ని మార్చే యోచనలో ఉందని డక్కెన్ హెరాల్డ్ తన కథనంలో ప్రస్తావించింది. అంతేకాదు పనిగంటలు పెంచి పనిచేసే ప్రాంతాల్లో రాత్రి వేళ పనిదినాల్లో మహిళలకు వెసులు బాటు కల్పించడంతో పాటు రవాణ, భద్రత, సెక్యూరిటీ, లైటింగ్ మెరుగుపరుచుకునే దిశగా చర్యలు తీసుకోనుందని వెల్లడించింది. పని గంటలను పొడిగించాలనే ప్రభుత్వ ప్రణాళికను కర్ణాటకలోని అనేక కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. బుధవారం, రాష్ట్ర కార్మిక శాఖ పరిశ్రమ, కార్మిక సంఘాల ప్రతినిధులతో ఒక సమావేశాన్ని నిర్వహించి చట్టానికి సాధ్యమయ్యే సవరణపై చర్చించింది. కర్ణాటక రాష్ట్ర ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) సమావేశంలో పాల్గొని ఈ ఆలోచనను స్పష్టంగా వ్యతిరేకించింది. కేఐటీయూ ఈ ప్రతిపాదనను బానిసత్వంగా అభివర్ణించింది. కార్మికుల ఆరోగ్యం, పని-జీవిత సమతుల్యత, ఉద్యోగ భద్రతకు హాని కలిగిస్తుందని పేర్కొంది. పనిగంటల విషయంలో ప్రభుత్వ ప్రతిపాదనల్ని టెక్నాలజీ రంగ ఉద్యోగులు వ్యతిరేకించాలని, వారికి అండగా నిలవాలని యూనియన్ విజ్ఞప్తి చేసింది. పనిగంటలు పెరిగితే భారీ ఎత్తున ఉద్యోగుల తొలగింపులు.. ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# కదలని 'ఇరాన్ నీడలు'.. ఒంటరిగా టెహ్రాన్

**ఇంటర్నెట్‌డెస్క్:** పశ్చిమాసియా రణరంగంలా మారింది. ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పరం బాంబుల మోత మోగిస్తున్నాయి. ఇప్పటికే ఇరుదేశాల్లోని కీలక ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. మరోవైపు తమతో అణుకార్యక్రమానికి ఒప్పందం కుదుర్చుకోవడం లేదన్న గుర్రుతో అగ్రరాజ్యం అమెరికా కూడా ఇరాన్‌పై కత్తులు నూరుతోంది. అదును చూసి దెబ్బ కొట్టేందుకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ఇరాన్ రాజకీయ నాయకత్వ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఇంత జరుగుతున్నా.. ఇన్నాళ్లూ ఇరాన్ పాలు పోసి పెంచిన హమాస్ హెజ్‌బొల్లా హూతీలు లాంటి ముసుగు సంస్థల జాడ ఏమాత్రం కనిపించడం లేదు. పెద్దన్నకు ఆపదొస్తే.. తమ్ముళ్లంతా ఎటు వెళ్లినట్లు? పశ్చిమాసియాలో ఓ బలమైన శక్తిగా ఎదిగిన ఇరాన్.. అనధికారిక సైన్యాన్ని పెద్ద ఎత్తున సమకూర్చుకుంది. పాలస్తీనాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హూతీలు, ఇరాక్‌లో కొన్ని ముసుగు సంస్థలను (ప్రాక్సీ దళాలు) ఏర్పాటు చేసి.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వాటి అభివృద్ధికి దోహదపడింది. నేరుగా తాను యుద్ధరంగంలోకి దిగకుండా.. శత్రుదేశాలపై వీరిని ఉసిగొల్పేది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ -హమాస్ యుద్ధం మొదలైంది. ఆ ఉగ్ర సంస్థకు సాయం చేసేందుకు హెజ్‌బొల్లా ముందుకురావడంతో ఆ యుద్ధం బీరుట్ వరకు ఎగబాకింది. ఇజ్రాయెల్ ప్రతాపానికి హమాస్, హెజ్‌బొల్లాలోని అగ్రనాయకత్వం తుడిచిపెట్టుకుపోయాయి. ఆయా వర్గాల్లో అంతర్గత కుమ్ములాటలు కూడా మొదలైనట్లు తెలుస్తోంది. వారిని ఏకతాటి మీదకు తీసుకురావాల్సిన ఇరాన్‌లో ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంతో 'ఇరాన్' ఒంటరి పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**చతికిల పడిన నమ్మినబంటు**

హెజ్‌బొల్లా.. లెబనాన్‌లో అత్యంత శక్తివంతమైన షియా పారామిలటరీ గ్రూప్. ఇరాన్‌కు నమ్మిన బంటు. గతంలో ఇజ్రాయెల్ హమాస్‌పై దాడికి దిగిన సమయంలో.. 'పెద్దన్న' ఆదేశాలతో లెబనాన్ సరిహద్దులోని ఇజ్రాయెల్ ప్రాంతాలపై క్షిపణి దాడులకు దిగింది. అలాంటిది.. ఇరాన్‌కే ఆపద ముం



చుకొస్తున్న సమయంలో మాత్రం స్తబ్దుగా వ్యవహరిస్తోంది. అయితే, ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటికే హెజ్‌బొల్లా తీవ్రంగా నష్టపోయినట్లు తెలుస్తోంది. అగ్రనేత హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ సైన్యం మట్టుబెట్టింది. ఆ తర్వాత దాని పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. నాయకత్వ లేమితోపాటు, శక్తి సామర్థ్యాలపై నమ్మకం సన్నగిల్లినట్లు అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. అంతేకాకుండా ప్రస్తుత అగ్రనేత నయీమ్ ఖాసిమ్ ఇరాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం లేదన్న వాదనలు కూడా ఉన్నాయి. ఈ తరుణంలో మరోసారి యుద్ధ రంగంలోకి దిగేందుకు హెజ్‌బొల్లా వెనకడుగు వేస్తోంది.

**హమాస్..శిథిలం**

పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్.. గాజాలో స్వయం ప్రకటిత రారాజుగా వర్ధిల్లింది. అయితే, రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌తో ప్రారంభమైన యుద్ధం తర్వాత దాదాపు నామరూపాల్లేకుండా పోయింది. అగ్రనేతలు హనియే, సిన్వర్‌లను ఇజ్రాయెల్ సైన్యం ఐడీఎఫ్ మట్టుబెట్టింది. అంతేకాకుండా టెల్‌అవీవ్ బాంబు దాడులతో గాజా ప్రాంతం శిథిలమైంది. సంక్షోభ పరిస్థితుల్లో హమాస్‌ను ముందుండి నడిపించాల్సిన నేత ఖలీద్ ఖతార్‌కు పారిపోయాడు. దీంతో నాయకత్వ లేమితో హమాస్ ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌కు మద్దతిచ్చేందుకు ఆ గ్రూప్ క్షేత్రస్థాయి నాయకులు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**మిలీషియాల పరిస్థితి అంతే..**

ఇరాన్‌తో పొత్తుపెట్టుకున్న ఇరాక్‌లోని షియా మిలీషియాలు (ఖతాయిబ్ హెజ్‌బొల్లా) అక్కడి అమెరికా దళాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ఇరాన్ ప్రయోజనాలను కాపాడేవారు. కానీ, ప్రస్తుతం అమెరికా నేరుగా ఇరాన్‌పైనే దాడులకు సిద్ధమవుతున్న తరుణంలో ఇకపై ఇరాక్‌లోని షియా మిలిషియాలు కూడా వెనక్కి తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్ తొలిసారిగా జనవరిలో దాడులకు తెగబడింది. అప్పట్లో షియా మిలీషియా గ్రూప్ కేవలం దాడులను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. కానీ, ఇరాన్‌కు అండగా ఉంటున్నట్లు మాత్రం చెప్పలేదు. మరోవైపు అటు ఇరాన్, ఇటు అమెరికాతో మంచి సంబంధాలున్న ఇరాక్ ప్రధాని మహ్మద్ అల్ సుడానీ కూడా మిలీషియా కమాండర్లను సంఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. దీంతో వారు కూడా ఇరాన్‌కు మద్దతుగా నిలిచే పరిస్థితులు కనిపించడం లేదు.

**కాస్త దగ్గరగా ఉన్నది హూతీలే!**

ఇరాన్ పెంచి పోషించిన ముసుగు సంస్థల్లో ప్రస్తుతం ఆ దేశానికి కాస్తో కూస్తో మద్దతుగా నిలుస్తున్నవారు హూతీలే. ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించారు. అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నప్పటికీ.. వారు కూడా ఆత్మరక్షణలో పడ్డారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో హూతీలకు చెందిన పలు క్షిపణులను అమెరికా నేల కూల్చింది. దీంతో వారికి కూడా భయం పట్టుకుంది. ఇరాన్‌కు మద్దతిస్తున్నటు చెబుతున్నారనే తప్ప..పూర్తి స్థాయిలో ముందుకు రావడం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఇజ్రాయెల్, అమెరికాల దూకుడును ఒంటరిగా మారిన ఇరాన్ ఎంతవరకు నిలువరిస్తుందో చూడాలి.

## 15 రోజుల్లోగా ఓటర్ ఐడీ కార్డుల డెలివరీ




**న్యూఢిల్లీ:** ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు(ఎపిక్)ను ఓటర్లకు చేరవేసే విషయంలో ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. 15 రోజుల్లోగానే ఈ కార్డులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోనున్నట్లు బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ఈ కార్డుల డెలివరీకి నెల రోజులకుపైగా సమయం పడుతోంది. ఇప్పుడు ఈ సమయం సగానికి తగ్గిపోనుంది. ఇందుకోసం నూతన ప్రామాణిక నియమావళిని ఎన్నికల సంఘం రూపొందించింది. కొత్తగా ఓటర్‌గా పేరు నమోదు చేసుకున్న తర్వాత లేదా ప్రస్తుతం ఉన్న కార్డులో మార్పులు చేర్పులు చేసుకున్న తర్వాత 15 రోజుల్లోగా నూతన ఫొటో గుర్తింపు కార్డు ఓటర్లకు అందనుంది.

ఓటరు గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైన్‌లో ఇలా దరఖాస్తు చేసుకోండి.

1. ముందుగా voters.eci.gov.in వైబ్‌సైట్ ఓపెన్ చేయాలి.
2. న్యూ రిజిస్ట్రేషన్ ఫర్ జనరల్ ఎలక్టర్స్‌లో 'ఫిల్ ఫామ్ 6'పై క్లిక్ చేయండి.
3. ఫిల్ ఫామ్ 6పై క్లిక్ చేయగానే లాగిన్ అడుగుతుంది.
4. కొత్త యూజర్లు మొబైల్ నంబర్, ఇమెయిల్ ID, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
5. తర్వాత మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది.
6. మీ పేరు, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి OTPని నమోదు చేయండి.
7. ఇప్పుడు ఫిల్ ఫామ్ 6పై క్లిక్ చేస్తే.. లింక్ ఓపెన్ అవుతుంది.
8. ఫామ్ 6లో మీ రాష్ట్రం, జిల్లా, నియోజవర్గం వివరాలు నమోదు చేయాలి.
9. మీ పూర్తి పేరు వివరాలతో పాటు పాస్‌పోర్ట్ ఫొటో అప్‌లోడ్ చేయాలి.
10. ఫోన్, ఆధార్ నంబరు, జెండర్, పెట్టినతేదీ, చిరునామాలతో పాటు సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.

ఈ వివరాలు అన్ని నమోదు చేసిన తర్వాత దరఖాస్తును ప్రివ్యూలో చూసుకుసుకోవాలి. అన్ని వివరాలు కరెక్టుగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ చేయాలి. 15 రోజుల్లోగానే ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డు మీరు పొందుతారు.

## ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి



**ఇంటర్నెట్ డెస్క్:** విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. "ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి" అని అమిత్ షా పిలుపునిచ్చారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉంద న్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## ఇజ్రాయెల్ నుంచి భారత పౌరుల తరలింపు కోసం.. ఆపరేషన్ సింధు

**న్యూఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇరాన్ నుంచి విద్యార్థులు, పౌరులను సురక్షితంగా భారత్ తరలించింది. అలాగే 'ఆపరేషన్ సింధు' కింద ఇజ్రాయెల్ నుంచి భారత పౌరులను తరలించేందుకు భారత్ సిద్ధమైంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ఈ విషయాన్ని గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ పౌరులు స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం సహాయం అందిస్తుందని తెలిపింది. కాగా, ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ పౌరుల భద్రత కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 'భారతీయులను తరలించడానికి టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం ఏర్పాట్లు చేస్తున్నది. మరోవైపు ఏవైనా సందేహాలు ఉంటే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఏర్పాటు చేసిన 24/7 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అమెరికా వీసా ఓ 'ప్రివిలేజీ' మాత్రమే.. 'హక్కు' కాదు

ఇంటర్నెట్ డెస్క్: వీసా అనేది ఓ ప్రివిలేజీ మాత్రమేనని, అది హక్కు కాదని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మరోసారి పేర్కొంది. వీసా జారీ చేసిన తర్వాత కూడా స్క్రీనింగ్ ఉంటుందని తెలిపింది. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే అధికారులు ఆ వీసాను రద్దు చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. అంతేకాకుండా స్టూడెంట్ లేదా పర్యటక వీసాపై వెళ్లేవారు మాదకద్రవ్యాలు తీసుకోవడం లేదా అమెరికా చట్టాలను ఉల్లంఘిస్తే భవిష్యత్తులో అమెరికా వీసాకు అనర్హులవుతారని ఉద్ఘాటించింది. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (%ణశీఝశ్రీఎ ుతీబఎజూ%) ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్రమ వలసదారుల అరెస్టులకు నిరసనగా లాస్ ఏంజెలెస్‌లో మొదలైన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. అవి దేశమంతటా వ్యాపించాయి. అయినప్పటికీ సోదాలను ఆపేదిలేదని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్రమ వలసదారులను అరెస్టుచేసి స్వదేశాలకు తిప్పి పంపుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తాజా ప్రకటన చేసింది. గడిచిన నెల వ్యవధిలో మూడుసార్లు ఇటువంటి ప్రకటన చేయడం గమనార్హం. అయితే, చట్టబద్ధంగా అమెరికాకు వచ్చే వారికి ఎప్పుడూ ఆహ్వానం ఉంటుందని పేర్కొన్న యూఎస్ ఎంబసీ.. అక్రమ ప్రవేశం, వీసా దుర్వినియోగానికి పాల్పడితే మాత్రం సహించేది లేదని స్పష్టం చేసింది. మరోవైపు ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను అమెరికా మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ (%వాశీఎఝశ్రీ వీవఎఋ ఎవ్‌ఱఅస్త్ర%) చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది.

# బనకచర్లను అడ్డుకోండి

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్-1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలియజేశారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని.. జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని.. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. బనకచర్ల విషయంలో ఏ నిబంధనలు పాటించని ఆంధ్రప్రదేశ్ వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జల్ శక్తి మంత్రితో సీఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. జీడబ్ల్యూడీటీ-1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని.. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు



మాత్రం కొనసాగిస్తూనే ఉందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. జాతీయప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తుంటే పోలవరం-బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి-నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామని సీఎం కేంద్ర మంత్రి పాటిల్ కు తెలియజేశారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేంద్ర మంత్రికి సీఎం స్పష్టం చేశారు.

**మేం 1500 టీఎంసీలకు వాడుకునేలా అనుమతులు ఇవ్వండి....**

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని.. ఆ తర్వాత ఏపీ చేప్టటే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారని... త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# కలహాల కమలం?

-మొదటిపేజీ తరువాయి

రోజుకొక ప్రజా ప్రతినిధి అందుబాటులో ఉంటున్నారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ బీజేపీ తల పెట్టిన ఈ కార్యక్రమంపై ఇప్పుడు అనేక విమర్శలు వస్తున్నాయట. గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఓ మంత్రి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన మంత్రులతో ముఖాముఖి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ప్రజా సమస్యలను తీర్చేందుకు వారంలో ఓ మంత్రి గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాదు తాజా ప్రజాప్రతినిధులతో పాటు, పార్టీ కీలక ప్రతినిధులు సైతం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోంది. మరోవైపు పూలే భవన్ వేదికగా వారంలో రెండు రోజులు అంటే.. మంగళవారం, శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై ఫోకస్ చేస్తున్నారు. ఇప్పుడు బీజేపీపై వస్తున్న విమర్శలు ఏంటంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ చేస్తున్న కార్యక్రమాన్ని.. బీజేపీ కాపీ చేస్తోందని విమర్శిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ. అంతేకాదు బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ మొదలైందట. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు బీజేపీ పార్టీ ఆఫీస్ మెట్లు ఎక్కడం లేదనే టాక్ వినిపిస్తోంది. రోజుకొక ప్రతినిధి పార్టీ కార్యాలయానికి చేస్తూ వెళ్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో చెప్పలేని పరిస్థితుల్లో నాయకత్వం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయట. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు, కార్మికులు, వివిధ వర్గాల నుంచి వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయి అంటూ బుకాయింపులు తప్పితే బీజేపీ చేపట్టిన భరోసాలో ప్రజలు, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు లేవనే కామెంట్లు ఇటు పొలిటికల్ సర్కిల్లో.. అటు కాంగ్రెస్ సర్కిల్లో వినిపిస్తున్నాయట. రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్‌మెంట్ అంశాలే ఎక్కువనే చర్చ. బీజేపీ భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది రెండు వారాలు గడుస్తోంది. ఇందులో ప్రజా సమస్యలు కాకుండా రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్ మెంట్ అంశాలే ఎక్కువగా వస్తున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు గత బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆగడాలు మినహాయిస్తే? ప్రజా పాలనపై బీజేపీ తలపెట్టిన భరోసా కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు ఇప్పటి వరకు రాకపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారిందట. కాంగ్రెస్ పాలనపై పొద్దున లేస్తే దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ నేతలకు ప్రజా పాలనపై క్లారిటీ వచ్చిందనే విమర్శలు కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్నాయి. ముగియనున్న జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ గడువు. త్వరలోనే స్థానిక సంస్థల



ఎన్నికలు రాబోతున్నాయి. అంతేకాదు 9 నెలల్లో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ గడువు కూడా ముగియనుండటంతో బీజేపీ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత బలం పెంచుకోవడానికి వ్యూహాలు పన్నుతోంది. పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో వారిని, కార్పొరేటర్లు లేని చోట డివిజన్ స్థాయి నాయకులు కాస్త ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ ఆదేశించినట్లు కాషాయ శ్రేణులు చెబుతున్నాయి. అందుకే కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లో ఉండాలని చూస్తోంది. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో 40కి పైగా సీట్లు సాధించిన బీజేపీ, మజ్లిస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రజలను అకట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి, హైదరాబాద్‌లో ఎంఐఎంను టార్గెట్ చేస్తూ హిందుత్వ ఎజెండాను సమర్థంగా వినిపించిందని, భవిష్యత్తులో తమకు కావలసిన మైలేజీని పెంచుకుందంటున్నారు. నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలే మైనస్. తెలంగాణలో సంస్థాగతంగాపార్టీ బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలో అధిష్టాన పెద్దలు ప్రణాళికలకు పదును పెడుతున్నారంట. కానీ రాష్ట్ర నేతల వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుండటంతో అధిష్టానం తలలు పట్టుకుంటుందంటున్నారు.పార్టీలో ఉన్న నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు మైనస్ అవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. వీటన్నింటిని కవర్ చేస్తూ కొత్త కొత్త కార్యక్రమాలను డిజైన్ చేస్తోంది కమలం పార్టీ. 11 ఏళ్ల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టడంతో పాటు ఈ 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు వంటి వివరాలను ప్రజలకు వివరించేందుకు కాషాయ దళం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, పథకాలపై చర్చలు. వికసిత్ భారత్ లక్ష్యానికి 11 ఏండ్లు అంటూ ప్రజల్లో మమేకం అయ్యేందుకు కసరత్తులు చేస్తున్నారు ఆ పార్టీ నేతలు. మరోవైపు తెలంగాణలో 8 ఎంపీ, 8 ఎమ్మెల్యేలు, 3 ఎమ్మెల్సీ లను కైవసం చేసుకున్న కాషాయా పార్టీ పూర్తి స్థాయిలో రాబోయే సమరానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటుంది. గెలిచిన వారంతా కూడా తమ తమ అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్ లకు తీసుకొచ్చిన నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దృష్టిసారిస్తున్నారు. అందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నా నిధులు, సంక్షేమ పథకాలపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకెళ్లి పార్టీకి మైలేజ్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రతి గ్రామానికి ఏమిచ్చాం? ఎంత మేరకు నిధులు కేటాయించామనే వివరాలు వారికి వివరించేలా బీజేపీ ప్రణాళికలు చేపడుతోందనీ పార్టీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. మొత్తానికి ఇటు తెలంగాణలో బీజేపీ భరోసా, అటు 11 ఏళ్ల మోడీ పాలనా భరోసా రాష్ట్ర బీజేపీకి ఏ విధంగా సహకరిస్తాయి అనేది చూడాలి.

## సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా

-మొదటిపేజీ తరువాయి

రూ.6,404 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం అందిస్తామని చెప్పారు.

## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు..

-మొదటిపేజీ తరువాయి

విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఏపీ బనకచర్ల ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. అఖిలపక్షా ఎంపీల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపటానికా, కట్టుకోమని చెప్పటానికా అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లమని చెప్పటానికి రేవంత్‌రెడ్డి ఎవరని మాజీ మంత్రి హరీష్‌రావు నిలదీశారు. గోదావరి, కృష్ణా నీళ్లను ఏపీ వాడుకోమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి దాసోహం అయ్యారని విమర్శించారు. నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా బేసిన్‌ల మీద బేసిక్ నాలెడ్జ్ కూడా రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో స్కూల్ పిల్లాడిని అడిగినా చెబుతాడని.. ఈ మాత్రం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. బనకచర్ల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్‌రెడ్డి అధికారులను అడగటం సిగ్గుచేటని అన్నారు. రేవంత్‌రెడ్డి తేలికగా అబద్దాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఉద్యమం చేయలేదు కాబట్టే.. రేవంత్‌రెడ్డికి నీటి విలువ తెలియదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా ఆరుమంత్రి పదవులకు రాజీనామా చేసిన చరిత్ర తమదని ఉద్ఘాటించారు. జగన్‌తో కేసీఆర్ మాట్లాడిన మాటలను రేవంత్‌రెడ్డి వక్రీకరించారని మండిపడ్డారు. నదీ మార్గం నుంచే నీళ్లు తేవాలని జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు మేలు జరిగేలా మాట్లాడుకోవాలని మాత్రమే గతంలో కేసీఆర్ అన్నారని తెలిపారు. ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడేలా ప్రణాళికలను రచించుకోవాలని మాత్రమే జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. సముద్రంలో కలుస్తున్న 3వేల టీఎంసీల్లో తెలంగాణకు 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని అన్నారు. సముద్రంలో కలిసే నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకోవాలని కేసీఆర్ ఎక్కడ చెప్పలేదని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. తెలంగాణ అంగీకారం లేకుండా నీటిని తీసుకెళ్తామంటే తాము ఒప్పుకోమని కేసీఆర్ స్పష్టం చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. వైఎస్ పెట్టిన జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని రేవంత్‌రెడ్డి గతంలో అనలేదా అని ప్రశ్నించారు. 19నెలల్లో ఒక్క ప్రాజెక్ట్ కూడా రేవంత్‌రెడ్డి ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వైఫల్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కుప్పకూలిందని ఆక్షేపించారు. తెలంగాణ హక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాడితే రేవంత్ ప్రభుత్వానికి సహకరిస్తామని..లేకపోతే రైతుల పక్షాన సుప్రీంకోర్టుకు వెళ్తామని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## రాహుల్ ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకరించింది



**హైదరాబాద్:** రాబోయే తరానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిక్సూచి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకరించి గెజిట్ విడుదల చేసిందని చెప్పారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా గాంధీభవన్‌లో వేడుకలు నిర్వహించారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్‌తో కలిసి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆలోచన మేరకే కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన చేసిందని పొన్నం అన్నారు. అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాత్రమే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన మంత్రిగా పొన్నం, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్, దళిత మంత్రిగా తాను నిదర్శనమన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా సామాన్య కార్యకర్త నుంచి మంత్రినయ్యానని చెప్పారు. మంత్రిగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు.

## నటి రమ్యశ్రీపై దాడి

**హైదరాబాద్ :** టాలీవుడ్ నటి రమ్యశ్రీ, ఆమె సోదరుడిపై హైదరాబాదులో దాడి జరిగింది. సంధ్యా కన్వెన్షన్ పక్కన ఉన్న ఎఫ్సీఐ కాలనీ లేఔట్ కు సంబంధించి హైడ్రా మార్కింగ్ చేయడం వావాదానికి దారితీసింది. హైడ్రా అ ధికారులు మార్కింగ్ చేస్తుండగా వీడియో తీసిన రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంతపై దాడి జరిగింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిని అనుకుని ఉన్న ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఔట్ లో సంధ్య కన్వెన్షన్ ఆక్రమణలను హైడ్రా అధికారులు నెల రోజుల కిందట తొలగించారు. పర్మిషన్ లేకుండా నిర్మించిన ఒక మినీ హాల్ రెండు షెడ్లు, కొన్ని గదులను హైడ్రా కూల్చివేసింది. అయితే సంధ్య కన్వెన్షన్ ఓనర్ శ్రీధర్ రావు ఎఫ్ సి ఐ లేఔట్ లో రోడ్లు పార్కుల ఆనవాళ్లు లేకుండా చేశారని ప్లాట్ యజమానులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు.ప్లాట్ యజమానుల వినతి మేరకు శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ అధికారులు, హైడ్రా అధికారులు మంగళవారం నాడు ఎఫ్‌సీఐ లేఔట్లలో రహదారుల గుర్తింపు పనులు చేపట్టారు. లైన్లు మార్కింగ్ చేస్తుండగా లేఔట్‌లో ఓ ప్లాట్ యజమాని అయిన రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్‌తో కలిసి తమ ఫోన్లో వీడియో తీశారు. అనంతరం మధ్యాహ్నం లంచ్‌కు వెళ్తున్న సమయంలో రమ్యశ్రీ, ఆమె సోదరుడ్ని కొందరు అడ్డుకున్నారు. వీడియోలు ఎందుకు తీశారంటూ వారి వద్ద ఉన్న ఫోన్ లాక్కునేందుకు చూడగా, అడ్డుకున్న ప్రశాంత్‌ను నిందితులు కొట్టారు. ఏ తప్పు లేకున్నా తమపై దాడి చేసిన సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్‌రావు అనుచరులపై చర్యలు తీసుకోవాలి గచ్చిబౌలి పోలీసులకు నటి రమ్యశ్రీ ఫిర్యాదు చేశారు. వీరి మధ్య గొడవపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. పోలీసులు బందోబస్తు నడుమ అధికారులు లేఔట్ రోడ్ల మార్కింగ్ చేశారని, అధికారుల సమక్షంలో గొడవ జరగలేదని తెలిపారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాహుల్

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**క్యాంపు ఆఫీస్ లో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు**

**జగిత్యాల :** మన ప్రియతమ నేత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దేశ భవిష్యత్ నాయకులు, లోక్ సభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీయే నని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ భారత దేశ భవిష్యత్ ఆశా జ్యోతి రాహుల్ గాంధీ అని కొనియాడారు. త్యాగాల కుటుంబం నుండి వచ్చిన నాయకుడు ప్రధాన మంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా దేశం కోసం పార్టీ కోసం పనిచేస్తున్నారన్నారు. జఎస్సారెస్పి ప్రాజెక్ట్ పునాది వేసింది రాహుల్ గాంధీ గారి తాత జవహర్ లాల్ నెహ్రూనన్నారు. దేశంలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడుగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ ప్రజల పక్షాన ఎల్లప్పుడు నిలబడి వున్నాడని ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు అడువల జ్యోతి లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, తాజా మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

# పదకొండేళ్ల బిజెపి పాలన స్వర్ణయుగం

**2047 కల్లా వికసిత్ భారత్..**

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్..**

**జగిత్యాల/పెగడపెల్లి :** పదకొండేళ్ల బిజెపి పాలనలో ప్రజా సంక్షేమం,అభివృద్ధి శరవేగంగా దూసుకుపోతున్నాయని నరేంద్రమోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా, సురక్షితంగా ఉన్నారని అందుకే నరేంద్రమోదీ పదకొండేళ్ల పరిపాలన కాలం స్వర్ణయుగం లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ పేర్కొన్నారు.గురువారం పెగడపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2047కల్లా వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే పదకొండేళ్లలో తెలంగాణాకు కేంద్రం నుండి పదకొండు లక్షల కోట్లు నిధులు మంజూరు అయ్యాయని అందులో భాగంగానే ఉపాధి హామీ పథకానికి 32,414 కోట్లు వ్యవసాయ రంగ అభివృద్ధికి 1,345 కోట్లు పన్నుల్లో వాటాకు గాను 1,96,420 కోట్లు, సర్వ శిక్ష అభియాన్ కింద 8,114 కోట్లు అంగన్వాడీలకు 9,172 కోట్లు గిరిజన విశ్వవిద్యాలయానికి 980 కోట్లు కంపా పథకానికి 4,018 కోట్లు పెన్షన్ల కోసం 2,078 కోట్లు 14వ ఆర్థిక సంఘం ద్వారా 8,760 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ద్వారా 10,882 కోట్లు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 9,597 కోట్లు స్మార్ట్ సిటీస్ కింద 500 కోట్లు అమృత్ పథకం కింద 3,856 కోట్లు ఎన్టీపీసీకి 10,997 కోట్లు విద్యుత్ రంగ బలోపేతానికి 7,086 కోట్లు, సాగునీటి కోసం 2,436 కోట్లు, జాతీయ రహదారులకు 1,58,000 కోట్లు, రైల్వేల అభివృద్ధికి 34,992 కోట్లు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు 2,672 కోట్లు, జలజీవన్ మిషన్ కింద 1,582 కోట్లు, కిసాన్ సమ్మాన్ నిధికి 10,086 కోట్లు, కనీస మద్దతుధర, ధాన్యం సేకరణకి 1,86,640 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం 46,000 కోట్లు రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్దరణ కొరకు 6,500 కోట్లు, వరంగల్, ఆదిలాబాద్ మెడికల్ కాలేజీలకు 240 కోట్లు, ఆయుష్మాన్ భారత్ కోసం 902 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద 6,968 కోట్లు, కరోనా వ్యాక్సిన్ కోసం



1,800 కోట్లు, స్వచ్ఛభారత్ అభియాన్ కింద 4,418 కోట్లు, ప్రధానమంత్రి గరీబు కళ్యాణ్ అన్న యోజన కింద 1,425 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డుకు 20,000 కోట్లు, ముద్ర యోజన పథకానికి 80 వేల కోట్లు, ప్రదానమంత్రి స్వనిదికి 840 కోట్లు ఇలా పదకొండు లక్షల కోట్ల నిధులు తెలంగాణాకు మంజూరు చేస్తే కేంద్రం నుండి నిధులేమి రావడం లేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి పదే పదే వెళ్తున్నారని బిఆర్ఎస్ నాయకులు వ్యంగ్యంగా మాట్లాడినప్పుడు ఇది ఫెడరల్ ప్రభుత్వం అని కేంద్రంతో సఖ్యతగా ఉండడం వల్లే గడిచిన ఏడాదిన్నర కాలంలో లక్ష యాభై వేల కోట్లు నిధులు తెలంగాణా అభివృద్ధికి తేగలిగామని కాంగ్రెస్ ఎంపీలు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు.తెలంగాణా నుండి పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్తున్న నిధులు గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి తెలంగాణా బడ్జెట్ లో డెబ్భై శాతానికి పైగా నిధులు ఒక్క హైదరాబాద్ మహానగరం నుండి మాత్రమే వస్తుందని అలాంటప్పుడు వెనుకబడ్డ ఆదిలాబాద్,ఆసిఫాబాద్ జిల్లాలకు నిధుల కేటాయింపు చేయకూడదా అని ప్రశ్నించారు.గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికే సరిపోతుందని కెసిఆర్ చేసిన అప్పులను దాచిపెట్టిండని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయకముందు ఒక భాధ్యతయుతమైన ఎంపీగా పీసీసీ అధ్యక్షుడిగా ఉండి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియదనడం సిగ్గుచేటన్నారు.అరవై ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా 74 విమానాశ్రాయాలు నిర్మిస్తే బిజెపి ప్రభుత్వం 2014 నుండి 2024 వరకు 152, కాంగ్రెస్ హయాంలో 7 ఎయిమ్స్ ఉంటే బిజెపి పదకొండేళ్లలో వాటిని 22 కు పెంచిందని కాంగ్రెస్ హయాంలో జాతీయ రహదారులు 91,287 ఉంటే వాటిని 1,78,603 కు పెంచిందని రైల్వే మార్గం 22,048 ఉంటే 55,198 కిలోమీటర్ల మేర నిర్మించిందని, విద్యుత్ సౌకర్యం దేశవ్యాప్తంగా 40 శాతం ఉంటే ఇప్పుడు 95 శాతం కి పెరిగిందని పదకొండవ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ 4వ స్థానంలోకి వచ్చిందని దానిని 3వ స్థానంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి తోడేటి గట్టయ్య ఉపాధ్యక్షులు కోట మల్లేశం సీనియర్ నాయకులు తడగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో గెలుస్తా... అజారుద్దీన్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యం అయింది. అధికార పార్టీ నుంచి ఎవరు పోటీ చేస్తారని అంశంపై పార్టీలోను, నియోజకవర్గంలోనూ పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు మహమ్మద్ అజారుద్దీన్ ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నట్లు స్పష్టం చేశారు. తనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో చివరి క్షణంలో టికెట్ ఇచ్చినప్పటికీ ఆఖరి వరకు పోరాడానని తక్కువ ఓట్లతో ఓడిపోవడం జరిగిందని అన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సగం సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల కంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో అత్యధిక ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చేలా తాను పనిచేశానని అన్నారు. తమ పార్టీలోనే ఉన్న కొంతమంది వ్యక్తులు కావాలని కొన్ని పత్రికల్లో, మీడియా మాధ్యమాల్లో, వెబ్ సైట్ల లో తప్పుడు వార్తలు



రాయిస్తున్నారని, తనకు టికెట్ ఇవ్వడంలేదని ప్రచారం చేస్తున్నారని ఈ విషయాన్ని కూడా తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో నమ్మకంగా ఉన్న తనకు ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసి వేణు గోపాల్ ఆశీస్సులు ఉన్నాయని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి గడిచిన ఏడాదిన్నర కాలంగా పని చేస్తున్నామని, ఇప్పటికీ పలుమార్లు బూత్ స్థాయి లో, డివిజన్ స్థాయిలో సమావేశాలు సైతం నిర్వహించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో తాను జూబ్లీహిల్స్ నియోజకవర్గం టికెట్ తెచ్చుకొని, గెలిచి రాహుల్ గాంధీ కి బహుమతిగా అందిస్తామని అన్నారు. నాంపల్లి నాయకుడు ఫిరోజ్ ఖాన్, ఇర్ఫాన్ అజీజ్, ఫహీమ్ కురేషీ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్ లో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేరు. మైనార్టీ ఎమ్మెల్యే కూడా లేరు. జూబ్లీహిల్స్ నుంచి మైనార్టీ నేతకే చాన్స్ ఇవ్వనున్నారు. ఈ సారి మజ్లిస్ మద్దతు కూడా లభించడం ఖాయం కావడంతో ఇక్కడ గెలిచే వారికి మంత్రి పదవి వస్తుందని భావిస్తున్నారు. అందుకే పోటీ మరింత తీవ్రంగా ఉంది.

# ఈఏడాది పాత విధానంలోనే ఇంజనీరింగ్ ఫీజులు

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంజినీరింగ్ విద్యార్థులకు శుభవార్త. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు ఈ ఏడాది సర్కారు నిరాకరించింది. ఇష్టారీతిన ఫీజుల పెంపు ప్రతిపాదనలపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త ఫీజుల అధ్యయనానికి కమిటీ వేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే ఫీజుల అంశంపై భేటీ అయిన టీఏఎఫ్ఆర్సీ ? తెలంగాణ అడ్మిషన్స్, ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఈ యేడాది పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.ఈ ఏడాది ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం జులై మొదటి వారంలో ఎప్ సెట్ కౌన్సిలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఫీజుల పెంపు అంశంపై కాలేజీల ప్రతిపాదనలంపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫీజుల సవరణపై, ప్రతిపాదనల అధ్యయనానికి ఒక సబ్ కమిటీ వేయాలని నిర్ణయించారు. అప్పటివరకు పాత ఫీజులనే అమలు చేయాలని ఆదేశించారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచి మూడేళ్లకు కొత్త




ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. కానీ సీఎం ఆదేశాలతో కాలేజీల తీరు, 2016 నాటికి టాస్క్‌ఫోర్స్ నివేదికలు, ఫీజుల పెంపు ప్రతిపాదనలపై అధ్యయన కమిటీ వేయనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.ఇంజినీరింగ్ విద్యలో ప్రతి మూడేళ్లకోసారి ఫీజుల పెంపు ప్రక్రియ సాగుతోంది. కాలేజీల్లో మౌళిక వసతులు, విద్యా ప్రమాణాలు పెంచుకున్నా.. కొన్ని కాలేజీలు అత్యధిక ఫీజు పెంపు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. దీంతో కాలేజీల్లో వసతులు, నిబంధనల అమలుపై నాటి టాస్క్ ఫోర్స్ నివేదికలు బయటపెట్టాలని సర్కారు ఆలోచన. దీంతో ఇప్పుడు కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 174 ఇంజినీరింగ్ కళాశాలలు ఉంటే అందులో 155 ప్రైవేట్ వే. వీటిలో ఇంకా నాలుగు కాలేజీలకు ఏఐసీటీయీ అనుమతులు రావాల్సి ఉంది.మొత్తంగా ఫీజుల పెంపు తాత్కాలికంగా బ్రేక్ పడినా.. కౌన్సిలింగ్ సమయానికి అధ్యయనం పూర్తైతే స్వల్పంగా పెంచే అవకాశం లేకపోలేదు. అధ్యయనం ఆలస్యం అయితే ఈ ఏడాది పాత ఫీజులతోనే విద్యార్థుల చదువులు బయటపడనున్నాయి. అంటే వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్ ఫీజులు పెరుగుతాయన్నమాట.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**వాస్తవ నేస్తం,ఉట్నూర్:** రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి, ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. భారత దేశ భవిష్యత్ ఆశా జ్యోతి రాహుల్ గాంధీ అని, త్యాగాల కుటుంబం నుండి వచ్చిన నాయకుడు ప్రధాన మంత్రి పదవి అవకాశం వచ్చినా దేశం కోసం పార్టీ కోసం పనిచేస్తున్నారనీ తెలిపారు.దేశంలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదని, ప్రతిపక్ష నాయకుడుగా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ ప్రజల పక్షాన ఉన్నారని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల పక్షాన వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆదివాసి రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, పరత్వాగ్ విశాల్, తిత్రే గోవింద్,కాత్లే బుచ్చన్న,గేడాం శ్రీధర్,రాజక్క, కనక సంతోష్, తొడసం భగవంత్ రావ్,జైతు పటేల్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తికి ఆక్సిడెంట్ జరిగిన విషయం కానిస్టేబుల్ వాసు చేరవాణి ద్వారా పోతంగల్ గ్రామానికి చెందిన సామజిక సేవకర్త డాక్టర్ సీతలే రమేష్ కీ తెలియజేయడంతో తన వాట్సాప్ స్టేటస్ లో ఈ యొక్క విషయాన్నీ తెలియపరచడంతో సుమారుగా 18000 వేల రూపాయలు జమచేసి వారి స్నేహితులు దత్తు పటేల్, కిరణ్, పంచారెడ్డి వారి స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులకు డబ్బులు ఇవ్వడం జరిగింది.తను పెట్టిన స్టేటస్ కీ స్పందించి సహకరించిన ప్రతి ఒకరికి ధన్యవాదాలు తెలుపుతూ సేవానే మనది ప్రతిఫలం ఆ భగవంతునిది అని ఇప్పటికి ఇలా చేయడం 16 వ సారి అని అయన తెలిపారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణ

**వాస్తవ నేస్తం,కోటగిరి :** కోటగిరి మండల కేంద్రంలో ఓఫర్ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 30 మంది పేద మహిళలకు 38 రోజుల పాటు ఉచిత టైలరింగ్ (కుట్టు మిషన్) శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 వ తేది నుండి 25 వరకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణను పేద మహిళలు ప్రతినియోగం చేసుకోవాలన్నరు. ఆసక్తి గలవారు 8099 58 7454 నంబర్ కు సంప్రదించాలన్నారు.

## ఆరోపణలు నిరూపించండి రాజకీయాలనుంచి తప్పుకుంటా

**సికింద్రాబాద్ :** కాళేశ్వరం కమిషన్ విషయంలో తనపై బురద చల్లడం సరికాదని,తనపై వచ్చిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.కాళేశ్వరం లో అవినీతి జరిగిందనే అంశంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అప్పటి మంత్రివర్గ ఉప సంఘం లో తనతో పాటు మరో ముగ్గురు మంత్రులు కూడా ఉన్నారని వారికి అన్ని వాస్తవాలు తెలుసని అన్నారు.బనకచర్ల పై ఆనాడే తాను మాట్లాడానని ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ లో కోట్లదిందే తానని తెలిపారు.కాళేశ్వరం కమిషన్ విచారణ త్వరగా పూర్తి చేస్తారన్న నమ్మకం తమకు లేదని,రిపోర్ట్ ఇస్తారనేది కూడా లేదన్నారు.వెంటనే సిబిఐ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే విచారణ ముగిసిన అనంతరం వచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో భాజాపా కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అవినీతి జరిగితే కూడా ఉపేక్షించేది లేదని అన్నారు. కాళేశ్వరం కేసీఆర్ నిర్మించింది కాదని జల యజ్ఞంలో భాగంగా ప్రాణహిత చేవెళ్లను రీడిజైన్ చేశారని అందులో 3 బ్యారేజీలు మాత్రమే కొత్తగా నిర్మించాలని వెల్లడించారు. ఈనెల 22 న 11 సంవత్సరాల భాజాప పాలనపై ఛాయాచిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

## మల్కాజిగిరి ప్రజల సమస్యలను తీర్చే ప్రయత్నం చేసాను

**సికింద్రాబాద్ :** ఈటల రాజేందర్ గురువారం మీడియాతో మాట్లాడారు. 11 ఏళ్ల అభివృద్ధిపై దేశవ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, సమావేశాలు జరుగుతున్నాయి. మల్కాజ్గిరి దేశం లోనే అతిపెద్ద నియోజకవర్గం. 38.4 లక్షల ఓట్లు ఉన్నాయి. బీజేపీనీ 4 లక్షల మెజారిటీతో గెలిపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో పోలైన ఓట్లలో 65 % ఓట్లు వేసి గెలిపించారు. ప్రజలు విశ్వాసాన్ని, నమ్మకాన్ని నా మీద ఉంచారు నాకు ఉన్న అనుభవం పరిచయాలతో.. వారి నోట్లో నాలుకలాగా ఉన్నంతలో వారి ప్రేమను పొందే ప్రయత్నం చేశాను.. ఉన్నంతలో వారి సమస్యలను తీర్చే ప్రయత్నం చేశానని అన్నారు. 11 సంవత్సరాల మోడీ పాలన సంవత్సర కాలంగా నేను ప్రజల్లో గడిపిన కాలాన్ని ఎగ్జిబిషన్ రూపంలో చెప్పబోతున్నాము. ఉద్యమకాలంలో అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ గా, తొలి ఆర్థిక మంత్రిగా, కష్ట కాలంలో కరోనా మంత్రిగా పని చేసిన నామీద అపారమైన నమ్మకం ప్రజలకు ఉంది. అనేక ఉద్యమాలు చేసిన వాన్ని కాబట్టి మల్కాజిగిరిలో కూడా ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో నావంతుపాత్ర పోషించానని అన్నారు.

## ఆయిల్ బాల్స్ తో దోమల నివారణ

**సానిటరీ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి**

జగిత్యాల : వర్షాకాలం దృష్ట్యా మురికి గుంతల్లో, నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా మున్సిపల్ పక్షాన దోమల నివారణకు చర్యలు చేపట్టామని జగిత్యాల మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి చెప్పారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగాగురువారం మున్సిపల్ పరిధిలోని 4,8,10,13,30 వార్డుల్లో డ్రైనేజి లు శుభ్రం చేసి,చెత్త, చేదారం తొలగించడమే కాకుండా ఇళ్లల్లో నీటి నిలువలు ఉండకుండదని ప్రజలకు సూచించారు.నీటి నిలువ ప్రాంతాల్లో

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com